క్లుప్తంగా

విద్యార్థులకు శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో యూత్ రెడ్ క్రాస్ నిర్వహించిన ప్రథమ చికిత్స శిక్షణ ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు శనివారం తెలిపారు. ప్రతి విద్యార్థి మానవత్వంతో ఇతరులకు సహాయం చేసే గుణం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్, డాక్టర్ జీఎస్పీపీ బీఎస్.మహాలక్ష్మి, వై.ప్రకాష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శైలశాస్త్రి, సోనీ, జి.రవితేజ, కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీలో అటల్‌గార్డెన్‌లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్‌వీబీఎస్ ఆచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా సెక్రటరీ తనుబుద్ధి సూర్య భాస్కరరావు, అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు, ముద్రగడ సూర్యచంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు ఒక్కపూటే నిర్వహించాలి

కంబాలచెరువు: పాఠశాలలన్నీ ఒక్కపూటే నిర్వహించాలని డీఐ బి.దిలీప్‌కుమార్ శనివారం తెలిపారు. రాష్ట్రంలో ఎండ తీవ్రత దృష్ట్యా గత నెల 18వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తోందని, అయినా కొన్ని ప్రైవేటు పాఠశాలలు రెండు పూటలూ పాఠశాల నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదులు అందాయన్నారు. అటువంటి పాఠశాలలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డీఈవో కె.వాసుదేవరావు ఆదేశించారన్నారు. దానవాయిపేటలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం ప్రైవేటు పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి సమ్మేటివ్–2 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పాఠశాలను ఒంటిపూట మాత్రమే నిర్వహించాలని ఆదేశించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కడియం: కాకినాడ కాలువలో కడియం కర్రల మిల్లు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కడియం పోలీసులు తెలిపారు. ప్యాంటు సగం వరకు మాత్రమే ధరించి ఉన్నాడన్నారు. అయిదడుగుల నాలుగు అంగుళాల పొడవు ఉన్నాడని, సుమారు ముప్పై ఏళ్ల లోపు వయస్సు ఉన్న వ్యక్తి అని తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఒక వేళ ఎవరైనా మృతుడిని గుర్తిస్తే 9440796587 నంబరుకు సమాచారం ఇవ్వాల్సిందిగా కడియం పోలీసులు కోరారు.

ఐఎన్‌టీఎస్‌వోలో విద్యార్థుల ప్రతిభ



విజయం సాధించిన వారికి బహుమతులు అందజేస్తున్న స్కూలు యాజమాన్యం

కంబాలచెరువు: స్థానిక సీతంపేట శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు ఐఎన్‌టీఎస్‌వో లెవెల్–2 పరీక్షలో విజయం సాధించారని ఆ స్కూలు ప్రిన్సిపాల్ పి.మహేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పాఠశాల ఏజీఎం ఎం.సురేష్ హాజరై విద్యార్థులను అభినందించారన్నారు. ఈ పరీక్షల్లో ఆరో తరగతి విద్యార్థి ఆర్.యశ్వంత్‌శ్రీ అభిజిత్ ప్రథమ బహుమతిగా ల్యాప్‌టాప్‌ను అందజేశారన్నారు. మొత్తం 59 మంది విద్యార్థులకు వివిధ విభాగాల్లో గోల్డ్‌మెడల్, బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారన్నారు. విజేతలను ఆర్ఐ వై.రామాంజనేయులు, ఉదయ్‌శంకర్, జోనల్ కో ఆర్డినేటర్ రామారావు, డీన్ కె.రాజు అభినందించారన్నారు.

సినిమాలు



శ్యామల	:	దిఫ్యామిలీస్టార్
సూర్యమినీ	:	గాడ్జిల్లా అండ్ కాంగ్
సూర్యప్యాలెస్	:	మంజుమ్మల్‌బాయ్స్
స్వామి	:	దిఫ్యామిలిస్టార్
శివజ్యోతి	:	దిఫ్యామిలీస్టార్
అనుశ్రీ	:	మంజుమ్మల్‌బాయ్స్
రాజా	:	దిఫ్యామిలీస్టార్
ఊర్వశి	:	ఓంభీమ్‌బుష్
రంభ	:	గాడ్జిల్లా అండ్ కాంగ్
మేనక	:	భరతనాట్యం
అప్సర	:	టిల్లు స్క్వేర్
కుమారి	:	టిల్లు స్క్వేర్
నామవరం		
వీఎస్ మహల్	:	దిఫ్యామిలీస్టార్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	దిఫ్యామిలీస్టార్, టిల్లుస్క్వేర్
కడియం		
వెంకటసూర్య	:	దిఫ్యామిలీస్టార్

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం



బొమ్మూరు ప్రచారంలో మహిళలకు అభివృద్ధిని వివరిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు, నాయకులు

- పేదల బతుకు మారింది వైఎస్సార్ సీపీ వల్లనే..
- బొమ్మూరు ఎన్నికల ప్రచారంలో మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్ (బాలజీపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన అందించారని, ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందిని మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. బొమ్మూరులోని బాలాజీపేట నుంచి మెయిన్‌రోడ్, వెంకటేశ్వరనగర్, రాఘవేంద్రకాలనీ తదితర ప్రాంతాల్లో న్యాయవాది, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. గడచిన ఐదేళ్లలో జగన్ అందించిన సుభిక్ష పాలన, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మళ్లీ ఒక్కసారి అవకాశం ఇస్తే ఆ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు, మరిన్ని ప్రజా ఉపయోగకరమైన పనులు చేపడతారన్నారు. అసలు వైఎస్సార్ సీపీకి ఎందుకు ఓటు వేయాలో ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాలు అందజేసి ప్రజలకు వివరించారు. భవిష్యత్తులో రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమన్నారు. దానికోసం ప్రజలంతా వైఎస్సార్ సీపీ తరఫున పోటీలో నిలిచిన తనకు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందించామని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేక, అసూయతో చంద్రబాబు నాయకుడు అడ్డుకున్నారని అసహనం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తామని ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగిస్తూ ప్రజలమిచ్చే పాలన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యెనుముల త్యాగరాజు, పార్టీ సాంస్కృతిక విభాగ రీజనల్ కోఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్లు మేడపాటి సద్గుణరామారెడ్డి, కెవి.సుబ్బారెడ్డి, సోమన శ్రీనివాస్, టి.వి.రమణ, మరడాపు శేఖర్, పార్టీనేతలు అక్కుమహంతి శ్రీనివాస్, కాకులపాటి కుమార్, కాటం సుస్మిత, నూనెదీప శ్రీ, పరిమళ నాని, శ్రీను, శేఖర్, చరణ్, సమీరా, కుమార్, రాజేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీనగర్‌లో...

బొమ్మూరులోని నేతాజీనగర్‌లో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రచారం నిర్వహించారు. నేతాజీనగర్ 16 వీధుల్లో ఇంటింటికి సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



నేతాజీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో ఇస్త్రీ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

భక్తికి ప్రతిరూపం రామానుజాచార్యులు

విగ్రహావిష్కరణ సభలో పాల్గొన్న త్రిదండి చినజీయర్ స్వామి, ఎంపీ భరత్



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న త్రిదండి చినజీయర్ స్వామి, ఎంపీభరత్

సీటీఆర్ఐ: భక్తికి ప్రతి రూపం రామానుజాచార్యులని, ఆయన విగ్రహాన్ని రాజమహేంద్రవరంలో ప్రతిష్ఠించడం నగరానికి తలమానికం వంటిదని రాజమహేంద్రవరం ఎంపీ, సిటీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కోఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అభివర్ణించారు. నగరంలోని గోదావరి గట్టున గౌతమీ ఘాట్ 'రంగ ధామం' వద్ద త్రిదండి చినజీయర్ స్వామి చేతుల మీదుగా రామానుజాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామానుజాచార్యుల విగ్రహానికి తొలి పూలమాల ఎంపీ చేతుల మీదుగా వేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ భరత్ మాట్లాడుతూ విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించిన తత్వమూర్తి, ఆస్తిక బ్రహ్మ, యోగి రామానుజాచార్యులు త్రిమతాచార్యులలో ద్వితీయులన్నారు. కర్తవ్య దీక్షలో ప్రదర్శించాల్సిన ధైర్యానికి, దేవునిపై చూపాల్సిన అనన్య సామాన్యమైన నమ్మకానికి, సాటిలేని భక్తికి రామానుజాచార్యులు జీవితం ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చునని అన్నారు. అటువంటి మహానుభావుని దివ్య ప్రతిరూపాన్ని ఇక్కడ ప్రతిష్ఠించడం, దానిని చినజీయర్ స్వామి చేతుల మీదుగా ఆవిష్కరించే కార్యక్రమంలో నేనూ భాగస్వామిని కావడం పూర్వజన్మ సుకృతం అని ఎంపీ భరత్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. చినజీయర్ స్వామీజీ మాట్లాడుతూ తన జీవితం ద్వారా రామానుజాచార్యులు మానవాళికి ఎన్నో సందేశాలు అందించారని, ఆయన జీవితం మానవులకు దివ్య సందేశం వంటిదన్నారు. అంతకు ముందు నగరంలోని 22వ వార్డు నాళం భీమరాజు వీధిలో కొలువైన వేంకటేశ్వర స్వామికి కేజీన్నర బంగారంతో తయారు చేసిన కిరీటాన్ని గీతా భవన్ సభ్యులు చినజీయర్ స్వామి చేతుల మీదుగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం నగరంలో సంస్కృతి కాలేజి నుంచి పేపరు మిల్లు వెళ్లే రోడ్డు, టీచర్సు కాలనీ, మెయిన్ రోడ్డు, రంగ్రీజుపేట రోడ్డు, నాగులచెరువు డ్రైను తదితర ప్రదేశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నగరంలో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైను పనులను చేపట్టి పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు త్వరిత గతిన పూర్తి చేస్తామన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాలలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో సూపరింటెండెంట్ ఇంజినీరు జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషగిరిరావు, మదర్ షా అలీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రకాశరావు, చంద్రశేఖరరావు, అసిస్టెంటు ఇంజినీర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు ఐ.శ్రీనివాస్, సయ్యద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడియం: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మురమండ సబ్‌స్టేషన్ పరిధిలోని దుళ్ల, పొట్టిలంక ఫీడర్లలో గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు డి.శ్రీధర్‌వర్మ తెలిపారు. ఆయా గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

అడ్డుకున్నా ఆగలేదు

- వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేయొద్దని టీడీపీ ఫిర్యాదు
- సచివాలయ సిబ్బందితో పంపిణీ
- ఇబ్బంది పడిన వృద్ధులు, దివ్యాంగులు
- 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



సుబ్బాయమ్మకు పింఛన్ అందిస్తున్న మహిళ పోలీస్ జ్ఞానేశ్వరి

సీటీఆర్ఐ: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలందరికీ అందతున్నాయి. దీంతో టీడీపీ కూటమీ ఓర్వలేక అనేక కుట్రలకు తెర లేపారు. కాని ఆ కుట్రలన్నీ సీఎం జగన్ తిప్పికోట్టారు. దీంతో మరింత పెట్రేగిన పచ్చ బ్యాచ్ ఏవిధంగానైనా జగన్ అందిస్తున్న పథకాలు అడ్డుకోవాలని అనేక ప్రయత్నాలు చేశారు. ఆఖరికి ఎన్నికల కోడ్ రూపంలో వారి కుట్రకి ఒక దారి దొరికింది. వలంటీర్ల ద్వారా పింఛన్లు అందిస్తే వారంతా ఇంటింటికీ వెళ్లి పింఛను అందించడమే కాకుండా ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయమని ప్రచారం చేస్తారని ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేసి వలంటీర్లని పింఛన్ల పంపిణీకి దూరం చేశారు. వారి శాడిజం వల్ల అనేక మంది లబ్ధిదారులు ఆందోళన చెందడమే కాకుండా కొంత మంది మృతి చెందారు.



28వ డివిజన్‌లో మోకాలు ఆపరేషన్‌తో ఇంటి వద్ద ఉంటున్న తాల్లూరి వెంకటలక్ష్మికి పింఛను అందజేస్తున్న సెక్రటరీ లోకేష్

ఆగని పింఛన్ పంపిణీ

వలంటీర్ల లేకపోయినా లబ్ధిదారులకు పింఛన్లు ఆగకూడదనే లక్ష్యంతో సచివాలయ సిబ్బంది మూడు రోజుల్లో 99 శాతం పింఛన్ పంపిణీ చేశారు. వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్న వారి ఇంటి వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్ అందించారు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 29,664 మంది లబ్ధిదారులకు రూ.8,96,66,000 కోట్లను అందించారు. శనివారం నాటికి 99 శాతం పింఛన్ పంపిణీ జరిగింది.

అభివృద్ధిని చూసి ఓటేయండి

- నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దుదాం
- 30వ డివిజన్‌లో పర్యటించిన ఎంపీ భరత్‌రామ్



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని, దాన్ని కొనసాగేందుకు వైఎస్సార్ సీపీని గెలిపించాల్సిందిగా ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని 30వ డివిజన్‌లో జెండా పంజా రోడ్డు తదితర ప్రాంతాల్లో డివిజన్ పర్యటన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ, వ్యాపార సంస్థల నిర్వాహకుల వద్దకు వెళ్లి నగరంలో అభివృద్ధి ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగాలంటే తనను ఆశీర్వదించమని అభ్యర్థించారు. ఎంపీగా నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానన్నారు. గత ఎంపీగా పనిచేసిన మురళీమోహన్ నగరాభివృద్ధికి ఎటువంటి కృషి చేయలేదన్నారు. 2019 ఎన్నికలలో సిటీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదిరెడ్డి భవానీ ఈ నగరానికి ఏమైనా ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పనిచేయలేదన్నారు. నేను నగరానికి అభివృద్ధి చేశానని భావిస్తేనే ఓటు వేయాలన్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయంటేనే ఓటు వేయండన్నారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో పలువురు వలంటీర్లు శనివారం హుకుంపేటలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. ప్రతిపక్ష పార్టీలు వలంటీర్లపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. పిడింగొయ్యి–2కు చెందిన ఎస్.అపర్ణ, పి.దివ్యకుమారి, పి.రత్నకుమారి, కె.నాగదేవి, పిడింగొయ్యి–4కు చెందిన పి.దుర్గాప్రసాద్, తొర్రేడుకు చెందిన కొత్తపల్లి జ్యోతికుమార్, ఉప్పులూరి సునీల్, ఎస్.గౌరీరత్నప్రియాంక, కాతేరుకు చెందిన మోరంపూడి అనిత, కాతేరు–2కు చెందిన కె.సుశీలదేవి, బి.ఐశ్వర్య, ఎస్.దివ్య, సీహెచ్ దుర్గాభవాని, కాతేరు–4కు చెందిన పప్పు విజయలక్ష్మి రాజీనామాలు చేశారు.

కడియం: కడియపుసావరం పంచాయతీ పరిధిలోని 25 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను పేద ప్రజలకు అందిస్తున్న తమ సేవలపై కొందరు రాజకీయ నాయకులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని అందుకే రాజీనామా చేస్తున్నామని తమ లేఖలో పేర్కొన్నారు. రాజీనామా లేఖను ఎంపీడీవో జీ.రాజ్‌మనోజ్‌కు అందజేశారు. కాగా ఇప్పటి వరకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 106 మంది వలంటీర్లు రాజీనామా లేఖలు అందజేశారని ఎంపీడీవో తెలిపారు.

మిసెస్ ఇండియా 2024 టైటిల్ విన్నర్ రత్న మెహెరా



మిసెస్ ఇండియా టైటిల్ విన్నర్ రత్నమోహరా

సీటీఆర్ఐ: హైదరాబాద్‌కు చెందిన రత్న మెహెరా మిసెస్ ఇండియా–2024 టైటిల్ గెలుచుకున్నారు. న్యూఢిల్లీలోని గుర్గావ్‌లో నిర్వహించిన మిసెస్ ఇండియా కాంటెస్ట్‌లో ఆమె ఈ అరుదైన గౌరవం దక్కింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం స్థానిక హోటల్ లా హాస్పిన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన కుటుంబ సహకారం వల్లే ఈ విజయం సాధించగలిగానని అన్నారు. ఆమె భర్త బలభద్ర రూపేష్ కుమార్ మరోసారి కిరీటాన్ని ఆమెకు ధరింపజేశారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం) : ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై స్థానిక ఐఎంఏ హాల్‌లో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యానికి స్టేట్ నోడల్ పర్సన్‌తో శనివారు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా హాస్పిటల్స్ వివరాలు, రోగి వివరాలు, పోర్టల్‌లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల మెయింటైన్ చేయడంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగి అబా ఐడీ ద్వారా హాస్పిటల్స్‌కు వచ్చినప్పుడు వారి వివరాలు ఈ పోర్టల్‌లో లాగిన్ అవడం ద్వారా రోగి వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆరోగ్య సిబ్బందితో ఐడీలను క్రియేట్ చేసిందన్నారు. అదేవిధంగా ఈ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్‌లో హెల్త్ ఫెసిలిటీని ట్యాగ్ చేస్తారన్నారు. వీటి ద్వారా రోగి వివరాలు తన వెంట తీసుకుని వెళ్లకపోయినప్పటికీ ఓటీపీ ద్వారా వైద్యులు అతని కేసు హిస్టరీని తెలుసుకోవడానికి వీలు పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్టాటిస్టికల్ అధికారి జె.కుమారస్వామి, జిల్లా సర్వేలెన్సు ఆఫీసర్ డాక్టర్ రాజీవ్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్మెంట్ ఆఫీసర్ డాక్టర్ అభిషేక్ రెడ్డి, డాక్టర్ నిశాంత్, డీఎస్‌వో భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ వసుధా మిశ్రా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి




ధవళేశ్వరంలో ప్రచారం నిర్వహిస్తున్న షర్మిలారెడ్డి, ఉమాశంకర్

ధవళేశ్వరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పేర్కొన్నారు. శనివారం మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు ఉమాశంకర్‌తో కలిసి ధవళేశ్వరంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని మేడపాటి షర్మిళారెడ్డి పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), ముత్యాల పోసికుమార్, షట్టర్ బాషా, మెండా రాజేష్, ముత్యాల జాన్, బర్రి కామేశ్వరరావు, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, పుట్టా పరేష్, రేగుళ్ళ రాజు, మిరప రమేష్, గూటం రాజు, నంబూరి రవి, ఎల్‌వీ ప్రసాద్, పసుపులేటి దేవి, చప్పిడి జ్యోతి, మద్దాల బాబి, పందెళ్ల భానుప్రసాద్, ధర్మ, పేరాబత్తుల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో నిఘా బృందాల విధులు అత్యంత కీలకం

రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ తేజ్‌భరత్



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించే ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటికల్ సర్వైవల్, వీడియో సర్వైవల్ బృందాలు నిబద్ధతతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్, రాజమండ్రి రూరల్ రిటర్నింగ్ అధికారి ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ బృందాల అధికారులందరికీ విధులు బాధ్యతలు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ, ప్రజలు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు వేసేందుకు క్షేత్ర స్థాయిలో విధులను నిర్వర్తించే ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటికల్, వీడియో సర్వైవల్ బృందాలు తనిఖీలు నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అన్ని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలకు సంబంధిత ఫిర్యాదులకు హాజరవ్వాలన్నారు. స్టాటికల్ సర్వైవల్ బృందాలు ప్రాంతాల సున్నితత్వాన్ని బట్టి కేంద్ర భద్రత సిబ్బందిని కలిగి ఉంటాయని తేజ్ భరత్ తెలిపారు. వీడియో సర్వైవల్ బృందాలు నియోజకవర్గంలో జరిగే సున్నిత సంఘటనలు, పెద్ద బహిరంగ సభల వీడియోగ్రఫీని సహాయ రిటర్నింగ్ అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వయంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. షూటింగ్ సందర్భంలో బృందం అంచనా వేసిన వాహనాల సంఖ్య, రకం, కుర్చీలు, ఫర్నిచర్, ఈవెంట్‌లో ఉపయోగించిన రోస్ట్రమ్, బ్యానర్, పోస్టర్లు, కటౌట్‌లు మొదలైనవి రికార్డ్ చేయాలన్నారు. ఆ సందర్భంగా ప్రదేశం, ఎవరికి చెందిన పార్టీ సమావేశం, అభ్యర్థి, ఎన్ని వాహనాలు సుమారు ఎంత మంది ఉన్నారు తదితర అంశాలపై వాయిస్ ఓవర్ చేసుకుని, తదుపరి వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసేందుకు భరోసా ఇచ్చే క్రమంలో వీడియో రికార్డింగ్ అత్యంత కీలకం కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబు, సీపీవో కొండయ్య , సహాయ రిటర్నింగ్ అధికార్లు లేదా తహసీల్దార్లు వైకేవీ అప్పారావు, బి.రమాదేవి, ఎంపీడీవోలు డి.శ్రీనివాసరావు, మనోజ్‌కుమార్, ఎంసీసీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, సెక్టార్ అధికారులు, సూపర్ వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.